క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేను కలిసిన హైకోర్టు చీఫ్ జస్టిస్



తాడ్డి సన్యాసినాయుడును కలిసిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి

గజపతినగరం: మాజీ ఎమ్మెల్యే, రాజకీయ కురువృద్ధుడు తాడ్డి సన్యాసినాయుడును హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి సోమవారం సాయంత్రం గజపతినగరంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సన్యాసినాయుడు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, రైతుల కోసం అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనా లు పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు విత్తనాలు,ఎరువులను గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా అందిస్తున్నామన్నారు. సాగు పెట్టుబడి నిమిత్తం ఏటా రూ.13,500 రైతు ఖాతాలో జమ చేస్తున్నామని చెప్పారు. రైతు సంతోషంగా ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ పీరుబండి పద్మ, ఏడీఏ ఏ.నాగభూషణరావు, ఏఓ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మధుపాడ, మదనాపురం గ్రామాల్లో వలంటీర్లను ఎంపీపీ పీరుబండి హైమావతి సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ మధుపాడ, మదనాపురం సర్పంచ్‌లు కిలపర్తి శ్రీరామ్మూర్తి, జాగరపు అప్పారావు, ఎంపీటీసీలు కల్లెంపూడి శేఖర్, గొర్లె చిన్నమ్మ, ఏఎంసీ డైరెక్టర్ గనివాడ కోట లక్ష్మి, పి.వెంకటరావు పాల్గొన్నారు.

జిన్నాంలో ‘ఫ్యామిలీ డాక్టర్’

గజపతినగరం రూరల్: మండలంలోని జిన్నాం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో సోమవారం ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నిర్వహించిన శిబిరంలో 32 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్యతనిఖీలు చేసి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామం వైపు అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం నుంచి వేపాడ మండలంలోని రామస్వామిపేట వైపు వెళ్తున్న రెండు వాహనాల్లో 85 బియ్యం బస్తాలు విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్ కుమార్, సీఐ బి.సింహాచలం, సీఎస్‌డీటీ రమేష్‌లు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం కొత్తవలస సివిల్ సప్లయిస్ గొడౌన్‌కు తరలించి తూకం వేయించగా 38క్వింటాళ్లు వచ్చినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తున్న బియ్యం, వాహనాలను సీజ్ చేసి వాహన దారులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గరివిడి ఎస్‌ఐ ఎల్.దామోదరరావు అన్నారు. గరివిడి మండలంలోని వి.పి.రేగ గ్రామస్తులకు సోమవారం సాయంత్రం పలు చట్టాలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు,మహిళలపై నేరాలు ఎక్కువగా జరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి మహిళా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఎవరైనా చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



చీపురుపల్లి: పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, మండల అధికారులు



శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న లెక్చరర్లు, విద్యార్థులు



బొండపల్లి: వెలుగు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ చలం నాయుడు, అధికారులు

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వెలుగు ఆధ్వర్యంలో ర్యాలీలు, విద్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. నానాటికి పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులను నియంత్రించి, ప్రజలకు ఆరోగ్యాన్ని అందివ్వగల శక్తి చెట్లకు మాత్రమే ఉందని, నేడు మనం నాటే మొక్కలు మన భవిష్యత్‌కు మెట్లు అని వక్తలు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రజలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. పలు చోట్ల అధికారులు, నాయకులు కలిసి మొక్కలు నాటారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వెలుగు ఏపీఎంలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, నాయకులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



గుర్ల: పాలవలసలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు, మహిళలు



గంట్యాడ: వెలుగు కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న వెలుగు సిబ్బంది



చీపురుపల్లిరూరల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గరివిడి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జాషువా జయప్రసాద్



బొండపల్లి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



చీపురుపల్లి: చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోవిందరావు

ప్రజలను మభ్యపెట్టడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మోసపూరిత హామీలు, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టడంతో పాటు ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని దుష్ప్రచారాలు చేయించడం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎద్దేవా చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు మళ్లీ మోసపూరిత హామీలు ఇస్తున్నారని, ఆయన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అ న్నారు. ఇటీవల గంట్యాడ మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారని ఓ పత్రికలో వచ్చిన వార్తను ఆయన ఖండించారు.టీడీపీ వారికే టీడీపీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి తమ పార్టీలో చేరారని టీడీపీ నాయకులు తమ అనుకూల పత్రికల్లో రాయించుకుని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి ఎన్నికల ముందు టీడీపీ నేతలు చేస్తున్న ఇదో రకమైన కొత్త ఎత్తుగడని అన్నారు. గతంలో దత్తిరాజేరు మండంలో కూడా ఇదే విధంగా ప్రచారం చేశారని మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు చేసే మోసాలు, మాయలను ఆ పార్టీ కింది స్థాయి నాయకులు కూడా చేస్తుండడం ఆనవాయితీగా మారిపోయిందని అన్నారు.

రూ. 110 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు

గజపతినగరం నియోజకవర్గంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 110 కోట్లతో జలజీవన్ మిషన్ పనులకు (ఇంటింట కుళాయిలు) త్వరలోనే టెండర్లు పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే అప్పలనరసయ్య తెలిపారు. కుళాయిల పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని చెప్పారు. అవినీతికి తావులేకుండా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో వివిధ పథకాలకు సంబంధించి నియోజకవర్గ ప్రజల ఖాతాల్లో రూ. 980 కోట్లను జమ చేశామని, అలాగే సుమారు రూ.750 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని స్పష్టం చేశారు. గజపతినగరం ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కర్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎం.రత్నం, ఎంపీడీఓ, మెరకముడిదాం

మెరకముడిదాం: మెరకముడిదాం ఎంపీడీఓగా ఎం.రత్నం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో జామి ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేశారు. పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికారు.

కొత్తవలస ఆర్‌ఐగా రాజేష్



సీహెచ్.రాజేష్, ఆర్ఐ, కొత్తవలస

కొత్తవలస: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్‌ఐ)గా సీహెచ్.రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్.కోట ఆర్‌ఐగా పనిచేసిన ఈయన బదిలీపై ఇక్కడికి రాగా, ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఎస్.కిశోర్‌కు జామి బదిలీ అయింది.



వేపాడ: బక్కునాయుడుపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఫ్లోరెన్స్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

గురుకులం ప్రిన్సిపాల్‌గా ఫ్లోరెన్స్

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఫ్లోరెన్స్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కృష్ణాపురం బాలుర పాఠశాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

బొండపల్లి ఎంపీడీఓగా రాజేంద్రప్రసాద్



బొండపల్లి: ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

బొండపల్లి: స్థానిక ఎంపీడీఓగా వై.వి.రాజేంద్ర ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డెంకాడ మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన ఏ.వేదవతికి జిల్లా పరిషత్ ఏఓగా బదిలీ అయ్యారు.

ఎల్.కోట తహసీల్దార్‌గా ఆదిబాబు

లక్కవరపుకోట: మండల తహసీల్దార్‌గా వి.ఆదిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన తామరాపల్లి రామకృష్ణకు మెంటాడ మండలానికి బదిలీ అయ్యింది.

చినకాద కార్యదర్శిగా సూర్యప్రకాష్

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామ సచివాలయం కార్యదర్శిగా బదిరి సూర్యప్రకాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పాచలవలస కార్యదర్శి ఇన్‌చార్జ్‌గా కొనసాగారు.

పింఛన్ సమస్యకు చెక్



ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును సన్మానిస్తున్న పింఛన్‌లబ్ధిదారు రాములప్పన్న, గ్రామస్తులు

కొత్తవలస: ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో ఓ వృద్ధురాలికి అందాల్సిన అభయ హస్తం పింఛన్ సమస్యకు పరిష్కారం లభించింది. వివరాల్లోకి వెళ్తే... లక్కవరపుకోట మండలం మాల్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల రాములప్పన్న అనే వృద్ధురాలికి 12 ఏళ్ల కిందట అభయ హస్తం పింఛన్ మంజూరైంది. అయితే, అదే గ్రామానికి చెందిన గోగాడ రాములప్పన్నకు అధికారులు పింఛన్ అందజేస్తున్నారు. మహిళకు ఇవాల్సిన అభయాస్తం పింఛన్‌ను తన పేరుతో ఉన్న వృద్ధుడికి ఎలా ఇస్తారంటూ ఆమె అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. సమస్యను ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, గ్రామస్తులు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో వృద్ధురాలితో పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేను క్యాంపు ఆఫీస్ వద్ద సోమవారం కలిసి సత్కరించారు.

సంక్షిప్తంగా...

వైఎస్సార్ జలకళ బోరు పరిశీలన

మెరకముడిదాం: గొట్టుపల్లిలో వైఎస్సార్‌జలకళ పథకంలో భాగంగా రైతు దేవాడ వెంకటరమణ పొలంలో తవ్వించిన బోరును ఉపాధి హామీ ఏపీడీ మీసాలశ్రీనివాసరావు, ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు, జేఈ ఎం.త్రినాథనాయుడు సోమవారం పరిశీలించారు. బోరుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్‌ను రైతు తన సొంతఖర్చుతో ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పంపుసెట్ మంజూరుకు ఆన్‌లైన్‌లో రైతు వివరాలను అధికారులు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దత్తిరాజేరు: మండలంలోని చౌదంతివలస సమీపంలో ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్.బూర్జవలస ఎస్సై జి.రాజేష్ సోమవారం తెలిపారు. రామభద్రపురం మండలం పారాది గెడ్డ నుంచి కె.కొత్తవలసకు ఇసుక తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

32మద్యం సీసాలు పట్టివేత

గజపతినగరం: మండలం కేంద్రంలోని దియా రెస్టారెంట్ సమీపంలో పాన్‌షాప్ వద్ద అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న ఓవ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై గంగరాజు తెలిపారు. మరుపల్లి గ్రామానికి చెందిన గెద్ద జగన్నాథం 32మద్యం సీసాలతో పట్టుబడడంతో అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను సీజ్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధర్నా

శృంగవరపుకోట: ప్రస్తుతం ఉన్న విశాఖ- అరుకు రోడ్డును విస్తరించాలని, బైపాస్ రోడ్డు కోసం రైతుల నుంచి భూములు బలవంతంగా లాక్కోవడం మానేయాలని ఏపీ రైతుసంఘం నేతృత్వంలో సీపీఐ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రైతు సంఘం కన్వీనర్ డేగల అప్పలరాజు మాట్లాడుతూ గ్రామసభలు లేకుండా రైతుల అభిప్రాయాలు అడగకకుండా బైపాస్ రోడ్డు కోసం భూముల్లో సర్వేరాళ్లు ఎలా వేస్తున్నారంటూ నిలదీశారు. రైతులు కోల్పోతున్న భూములకు ప్రత్యామ్నాయ భూములు చూపితేనే భూసేకరణ చేయాలని స్పష్టం చేశారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న రోడ్డులో ఆక్రమణలు తీస్తే అవసరాలు తీరుతాయన్నారు. రైతులకు పూర్తిగా తగిన హామీలు ఇచ్చి, పరిహారం ప్రకటించిన తర్వాతే సర్వేకు రావాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ, రైతు సంఘం నాయకులు,రైతులు డేగల అప్పలరాజు, మద్దికృష్ణ, షేక్ స్వామి, సూర్యం జోగినాయుడు, వి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నేరం

వేపాడ: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య విహహాలు చేసే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మండలంలోని బానాది గ్రామంలో మైనర్ బాలికకు వివాహం చేసేందుకు సన్నద్ధమైన తల్లిదండ్రులకు ఐసీడీఎస్ పీఓ లక్ష్మీబాయి,ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు, ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే ‘స్పందన’



గజపతినగరం: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శనం

గజపతినగరం: ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికే ప్రభుత్వం ప్రతీ సోమవారం ‘స్పందన’ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ‘స్పందన’లో ఆయన అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈఓపీఆర్డీ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

బొండపల్లి: స్పందనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అధికారులు రెండు వినతులు స్వీకరించారు. తహసీల్దార్ డి.ఎస్.జి.ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావ పాల్గొన్నారు.

రెండు వినతులు

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు అందాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతరం ఆయన పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గజపతినగరం: అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: దాసుపేటలో రామాలయ నిర్మాణ శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామపెద్దలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.సుబ్బారావు, కాశీ విశ్వనాథం, సూర్యనారాయణ ఉదయం నుంచి గ్రామస్తులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.ఆలయం వద్ద మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి సుమారు మూడు వేల మంది భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. గ్రామ పెద్దలు గురుగుబిల్లి సత్యనారాయణ, జి.కృష్ణ, ప్రతాప్, ఎం.సత్యారావు, గురుగుబిల్లి లక్ష్మునాయుడు, కె.చిన్నయ్యస్వామి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేట గ్రామంలో రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, గ్రామపెద్దలు సోమవారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు రమణమ్మ, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, పోరలి పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే ‘గడప గడపకు’

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తవలస: వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



చీపురుపల్లిరూరల్: సీఎం జగన్ సందేశ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, తదితరులు

కొత్తవలస: ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ‘గడప గడపకు మనప్రభుత్వం’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు.మంగళపాలెం గ్రామంలో సోమవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు.గ్రామంలో మురుగు కాలువలు, తాగునీటి సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామం రెండు సచివాలయాల పరిధిలో ఉందని ఒకే సచివాలయం,ఒకే పంచాయతీ పరిధిలోకి తీసుకురావాలని స్థానికుడు ఐతంశెట్టి శ్రీనివాసరావు ఎమ్మెల్యేకి వినతపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని,రూ.20లక్షలతో సీ సీ కాలువలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాన్నిఒకే సచివాలయం,ఒకే పంచాయతీ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని హామీఇచ్చారు. ఎంపీడీఓ వై.పద్మజ,పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, సర్పంచ్ ఐ.లక్ష్మి, ఎంపీటీసీ కె.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల సంతోషమే ముఖ్యం

చీపురుపల్లిరూరల్: అన్ని వర్గాల ప్రజల సంతోషమే సీఎంజగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అన్నారు.పెదనడిపల్లిలో సో మవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ నిర్వహించారు. అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పిసిని శ్రీనివాసరావు, సర్పంచ్ పాలరాజు, ఎంపీటీసీ ఆదినారాయణ,వైస్ సర్పంచ్ వి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



ఎంపీడీఓ వేదవతిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

బొండపల్లి: ఏ రంగంలో అయినా చేసిన సేవలే తగిన గుర్తింపు ఇస్తాయని ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్య ప్రకాశరావు అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసి జిల్లా పరిషత్ కార్యాలయానికి ఏఓగా బదిలీ అయిన ఏ.వేదవతిని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఎస్.జి.ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, ఏపీఓ కృష్ణవేణి, ఏపీఎం సులోచనాదేవి, సీనియర్ సహాయకులు డి.వెంకటరమణ, ఒంపల్లి సర్పంచ్ లండా నారాయణమ్మ, పెద్దమజ్జి గోపి పాల్గొన్నారు.